
# మృదుల

వాలి హిరణ్మయీదేవి



"నాన్నా, టాబ్లెట్స్ వేసుకొన్నారా?" వస్తూనే ప్రశ్నించింది మృదుల.

"వేసుకొన్నానమ్మా" చెప్పాడు రంగనాథం.

ఆయన పడుకొని ఉన్న మంచానికి ఆనుకొని ఓ చిన్నబల్ల ఉంది. దాని మీద పెట్టి ఉన్న గిన్నెల మూతలు తీసి చూసి "ఇదేంటి నాన్నా? ఎక్కడివక్కడే ఉన్నాయి. కనీసం ఈ బత్తాయితొనలన్నా తినలేదేం?" నొచ్చుకుంటూ అడిగింది మృదుల.


"అదో అనవసరపు ఖర్చంటే విన వెందుకమ్మా? అన్నట్టు ఇవాళయినా ఆఫీస్‌కి అన్నయ్య దగ్గర్నుంచి ఏమైనా లెటర్స్ వచ్చాయా?"

"ఉహూ, రాలేదు" అంటూ వంటింట్లోకి దారి తీసింది మృదుల.

మెల్లగా నిట్టూర్చా డాయన. తర్వాత తలగడని వెనక్కి లాక్కొని కాస్త పైకి జరిగి దాన్ని ఆనుకొని కూర్చున్నాడు. పెరట్లో అంట్లు తోముతున్న మృదుల కనిపించింది. అలసట నిండిన ఆమె మొహాన్ని చూడగానే అతని మనసంత భారంగా అయిపోయింది.

"అటు ఆఫీసు పని-ఇటు ఇంటిపని-పైగా తన చాకిరి... పిల్ల నలిగి పోతోంది." వేదనగా అనుకొన్నాడు.

"పెళ్ళి సంబంధం కుదిరేటట్లుంది. ఓ సారి వచ్చి ఆ విషయం సెటిల్ చేసి నన్ను మీతో తీసుకుపోరా " అని రఘు కెన్నిసార్లు రాసినా జవాబు లేదు. కొడుకు పంచన ఈ వృద్ధాప్యంలో



ఆసరా దొరుకుతుందనుకొని ఆశపడ్డా డెంతగానో-కానీ అది నిరాశే అవుతోంది.

ముగ్గురు ఆడపిల్లల తర్వాత పుట్టిన రఘుని-వంశోద్ధారకుడంటూ పువ్వుల్లో పెట్టి పెంచుకొన్నారు. ఇంకా మగపిల్లలు కావాలన్న ఆశతో మరో ఇద్దరు ఆడ పిల్లలకు తండ్రయ్యాడు. దాంతో ఒక్కడే మగనలునంటూ తనూ, తన భార్యా తెగ గారాబం చేసి పెంచారు. ముగ్గురాడపిల్లలకు పిత్రార్జితాన్ని తెగనమ్మి పెళ్ళిళ్ళు చేశాడు తను. ఇక తర్వాతి ఆడపిల్లల విషయం ఆ దైవానికి వదిలేశాడు. తన కిష్టం లేకుండా తన ఇంట ప్రాణం పోసుకొన్న ఆ చివరి ఆడపిల్లలెప్పుడూ తన కంటికి ఓ పీడగా కనిపించి ఎంత హీనంగా చూడాలో అంత హీనంగానూ చూశాడు. వాళ్ళే దడిగినా కొట్టీ తిట్టీ వాళ్ళ నోళ్ళు మూయించి-రఘుకి మాత్రం అన్నీ అమరించేవాడు. అతిగారాబంతో-చేతి నిండా పుష్కలంగా డబ్బుతో రఘు దుర్వ్యసనాల పాలయ్యాడని తెలుసుకొనేసరికి జరగవలసిన అనర్థం జరిగిపోయింది. కొడుకు ఒళ్ళు రోగాల

పుట్టగా మారడంతో ఉన్న ఇల్లు అమ్మి వైద్యం జరిపించారు.

"ఇరవై వేలు లంచం ఇస్తే ఉద్యోగం దొరుకుతుం"దని రఘు చెబితే. "వాడు ఉద్యోగంలో చేరి మననేగా పోషిస్తాడంటూ తన భార్య లక్ష్మి తనకి పసుపు కుంకుమగా పుట్టింటి వాళ్ళిచ్చిన పొలాన్ని అమ్మి మరీ డబ్బు సమకూర్చింది. కొడుకేదో ఉద్ధరిస్తాడని కలలుగన్న ఆమె అఖరి కోరికను గూడా తీర్చలేదు రఘు.

"మీ అమ్మ కాన్సర్ రోగంతో-ఇవాళో-రేపో అన్నట్లుండి చివరి చూపుగా ఉంది. ఓ సారి వచ్చి కన్పించి వెళ్ళరా' అంటే లీవ్ లేదని-ఇన్స్పెక్షన్ జరుగుతోందని చెప్పి రాలేదు. తర్వాత ఎవరో చెప్పగా తెలిసింది "ఎవరో గర్ల్ ఫ్రెండ్‌తో రఘు బెంగుళూర్ వెళ్ళా"డని. దాంతో గుండె పగిలి కన్ను మూసింది లక్ష్మి. ఆ దెబ్బకి కోలుకోలేని తనను పక్షవాతం తో మూలపడేశా డా భగవంతుడు-తను మంచంలో బాగానే ఉంటున్నాడు. ఎటొచ్చీ మృదులకే బాధలన్నీ వచ్చి పడ్డాయ్.

అస్తవ్యస్థంగా ఉన్న ఇంటిని చక్కదిద్దింది మృదుల. చిన్న పిల్లే అయినా తను వద్దని మొత్తుకొంటున్నా ఇంట్లో కూర్చొని ఉబుసుపోకకు చదివిన చదువుతో-ఉద్యోగం సంపాదించింది తన మొహాన చెప్పుచ్చుకు కొట్టినట్లుగా.

"నాన్నా! చెల్లి చదువు పట్ల ఇంట్రెస్ట్ కనబరచటం లేదు. పెళ్ళి చేద్దామనుకొంటున్నా" నంటూ ఆఫీసు నుంచి లోన్ తీసుకుని పెళ్ళి జరిపించింది- పెద్దపిల్లకు కాకుండా చిన్నపిల్లకి పెళ్లేంటని లోకం బుగ్గలు నొక్కుకున్నారు.

తను ఏనాడు అక్కున చేర్చి ముద్దాడకున్నా తండ్రినన్న గౌరవంతో ఇప్పుడు తన నో పసిపాపడిలా కళ్ళలో పెట్టుకొని చూసుకొంటోంది. భూదేవిని క్షమా మూర్తంటారు కానీ తన కళ్ళెదుటనే ఉన్న ఆ తల్లి మాత్రం మృదులే.

"మృదుల ఇంట్లోనే ఉందాండీ?" అంటూ వచ్చిన శేఖరం రాకతో ఆలోచనల్లో నుండి బైటపడ్డా రాయన.

## డొంకతిరుగుడు

తనూజ, సుబ్బారావు టాంక్‌బండ్ మీద కూర్చున్నారు.

"ఏమండీ! మీరూ, నేనూ ఇలా పక్క పక్కనే కూర్చుంటే చాలా బాగుంది కదండీ?" అంది తనూజ.

"డొంకతిరుగుడుగా మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పాను? ఇంతకీ నీకు ఐస్క్రీం కావాలా?, చెరుకు రసం కావాలా?" అడిగాడు సుబ్బారావు.

చుక్కపల్లి సత్యనారాయణ

## కొత్త డిజైన్స్

యజమాని: ఈ అయ్యగారికి మొన్న కొత్తగా వచ్చిన న్యూ డిజైన్స్ చూపించు.

గుమస్తా: ఆ పాత స్టా కంతా అయిపోయింది కదండీ!

పి.ఆర్. బద్దిగం

"ఆ వంటింట్లో ఉంది. వెళ్ళు బాబూ" అన్నా రాయన.

శేఖరం లోపలి కెళ్ళాడు. మృదుల కొలీగ్ శేఖరం. అప్పుడప్పుడూ వచ్చి పోతుంటాడు. శేఖరానికీ, మృదులకీ పెళ్ళి జరిగితే చాలన్న కోరి కెంత బలంగా ఉందో, ఆమె పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే తన కెవరు దిక్కన్న భయమూ అంతే ఉంది.

పెద్ద కూతుళ్ళు ముగ్గురూ ఏ పండక్కో వచ్చి "అమ్మ ఉంటే ఇలాంటి చీరలే పెట్టేదా" అంటూ చెల్లెల్నీ తననూ దెప్పి పెట్టుపోతలందుకొని పోతారే తప్ప "నాన్నా మా దగ్గరకు గూడా వచ్చి ఉండండి" అన్న పాపాన పోలేదు. ఇక రఘు సరేసరి! కనీసం వచ్చి మొహమైనా చూపించడు. వాళ్ళెళ్ళ పెళ్ళిమా టెత్తకుండా పెళ్ళి చేసుకొన్నాడు-ఇద్దరు పిల్లలే అయినా నా సంపాదన నా సంసారానికే చాలటం లేదని పేదరువులు అరుస్తూంటాడు.

శేఖరం మాటలేవో కాస్త గట్టిగా వినిపించడంతో అటు చెవులు రిక్కించి వినసాగాడు ఆలోచనల్లోంచి తేరుకొని.

"మృదులా! రాత్రంతా ఆలోచించాను. మీ నాన్నగారిని హెూంఫర్ ఏజ్‌డ్‌లో చేర్పించేద్దాం. అందుకయ్యే ఖర్చంతా నేనే భరిస్తాను గాని మన పెళ్ళికి ఒప్పుకో."

"సారీ! శేఖరం. ఇందరం ఉండి-ముఖ్యంగా నేను బ్రతికుండి నాన్నగారి నలా అనాథలా వదిలెయ్యలేను. ఈ వయసులో ఆయన క్కావలసింది వేళకింత తిండి మాత్రమేనా? అంతకు మించి పిల్లల ప్రేమానురాగాలు కోరుకొంటారు. కాబట్టి నాన్నగారు మనతోనే ఉండేటట్లు ఒప్పుకొంటేనే మన పెళ్ళి జరిగేది." మృదువుగానే అయినా ఖచ్చితంగా చెప్పింది మృదుల.


ఆ మాటలు వింటూంటే చివ్వున నీళ్ళు కమ్ముకొచ్చేశాయ్ కళ్ళ నిండుగా రంగనాథానికి.

శేఖరం వెళ్ళి పోయాక మృదులని పిలిచి-"తల్లీ! ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకొన్నానో నీ లాంటి కూతుర్ని పొందాను. తండ్రిగా నా కిన్ని సేవలు చేస్తున్నావే. అవి అందుకొంటూ వాటికి ప్రతిఫలంగా నీకు జన్మలో పెళ్ళియోగం లేకుండా చెయ్యమంటావా? నా తిప్పలేవో నేను పడతాను గాని శేఖరానికి నీ అంగీకారం తెలిజేయమ్మా." ప్రాధేయపూర్వకంగా అడిగా డాయన.

"నాన్నా! పరాయివాడిలా ఏం మాటలవి? నా కీ జన్మ ఇచ్చింది మీరు. నే నీనాడు ఈ మాత్రం నా కళ్ళ మీద నిలబడ్డానూ అంటే మీరు పెట్టిన తిండితిని-మీరు చెప్పించిన చదువుతోనేగా?

"-ఇక పెళ్ళి విషయం. ఇక్కడ సమస్య మీరు కాదు నాన్నా!నన్నూ నా వ్యక్తిత్వాన్ని శేఖరం గౌరవిస్తున్నాడా, లేదా అన్నది. నాకూ కోరికలుంటాయ్. వాటి నతడు మన్నించాలి గదా. నా ఇష్టానిష్టాలు గమనించినవాడికే భార్య నవ్వాలని నా కోరిక." స్థిరంగా చెబుతున్న మృదులని విస్మయంగా చూస్తూండిపోయారు రంగనాథం గారు.

" నా తల్లిని చల్లగా చూడు తండ్రీ" అంటూ మనస్ఫూర్తిగా మనసులో వేడుకొన్నా డాయన-అంతకు మించి ఏం చేయలేని అశక్తుడు గనుక. ★




## విస్ఫోటనం

మూసిన కన్ను రెప్పల చాటున
కడలి అలల్లా కదలిపోతున్న
కలలు కన్నీళ్ళుగా రూపాంతరం
చెందినప్పుడు -

జీవన ప్రాంగణాన దిద్దుకొన్న
ఆశల రంగవల్లులకి
కాలం చెల్లిపోతుందని కచ్చితంగా
తెలిసినప్పుడు -

స్వాతిముత్యం కో సం వేచి చూస్తుంటే
విధి పిడుగు పాపై పడి
జీవన కేదారాన్ని నిలువునా
దగ్ధం కావించినప్పుడు -

నా ఎదలో విస్ఫోటనం ....!

- నన్నపనేని రమాదేవి